సెట్విన్ ఆధ్వర్యంలో వివిధ కోర్సుల్లో శిక్షణ

కామారెడ్డి టౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓల్డ్ జీవీఎస్ కళాశాల వద్ద గల సెట్విన్ ఆధ్వర్యంలో వివిధ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు కో ఆర్డినేటర్ సయ్యద్ మొయినుద్దీన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీసీఏ, పీజీడీసీఏ, టాలీ, ఫొటోషాప్, జావా, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, మెహందీ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఉచిత స్టడీ మెటీరియల్‌తో పాటు కోర్సు ఫీజుల్లో 50 శాతం రాయితీ కల్పిస్తామని తెలిపారు. వివరాలకు 73861 80456, 79891 59121 నెంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

మంజీరాలో రీచ్‌లు రద్దయినా..

గుట్టుగా ఇసుక దందా!



- మంజీరాను కొల్లగొడుతున్న అక్రమార్కులు
- రాత్రి వేళ భారీగా ఇసుక తవ్వకాలు
- హస్గుల్, షెట్లూర్, ఖద్గవ్, మంజీరా శివారులో డంపులు
- పొతంగల్ మంజీరా నుంచి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా బిచ్కుంద మీదుగా తరలింపు
- ఇసుక అక్రమార్కులకు స్థానిక రెవెన్యూ, పోలీసుల అండ
- ముడుపులు ఇచ్చిన ఇసుక ట్రాక్టర్లను వదిలేస్తున్నట్లు ఆరోపణలు
- మంజీరాలో ఇసుక క్వారీలకు ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్ల ప్రయత్నాలు

ఇసుకను తోడుతున్న దృశ్యం (ఫైల్)



ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న పోలీసులు

కామారెడ్డి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక అక్రమ రవాణా దందా ఆగడం లేదు. మంజీరా నదితో పాటు జిల్లాలోని పలు వాగులు, వంకలు, నదుల్లోంచి ఇసుకాసురులు ఇసుకను తోడేళ్లలా తవ్వేస్తూ అక్రమంగా తరలిస్తున్నారు. ప్రధానంగా మంజీరా నదిలోంచి ఇసుకను తవ్వేస్తూ అక్రమంగా కోట్లాది రూపాయల ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. బీర్కూర్, బిచ్కుంద మంజీరాలో ఇసుక రీచ్‌లు మూసివేసినా ఇసుక అక్రమ రవాణా మాత్రం సాగుతునే ఉంది. క్వారీల పేరిట కొందరు ఇసుకాసురులు ట్రాక్టర్లు, భారీ లారీలు, టిప్పర్లతో గుట్టుగా హైదరాబాద్, మహారాష్ట్రలాంటి మహానగరాలకు తరలిస్తూ కోట్లు గడిస్తున్నారు. స్థానిక నేతలు, అధికారుల అండదండలతోనే ఇసుకను కొల్లగొడుతున్నారంటూ స్థానిక ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంజీరా నదిలో వరద ప్రవహిస్తున్నా ఇసుకాసురులు బరితెగించి ఇసుకను తరలిస్తున్నారు. అయితే ఇసుక అక్రమ రవాణాలో స్థానికంగా ఉండే కొందరు రెవెన్యూ, పోలీసు అధికారులు సిబ్బంది అండదండలు ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ముడుపులు ఇచ్చిన ఇసుక ట్రాక్టర్‌లను వదిలేస్తున్నారని.. ఇవ్వని వాటిని పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ఉన్నతాధికారులు ఇసుక అక్రమరవాణాను కట్టడి చేస్తున్నా క్షేత్రస్థాయిలో కొందరు అధికారులు, సిబ్బంది ముడుపులకు అలవాటుపడి అక్రమ రవాణాను ప్రోత్సహిస్తున్నారు.

ఇసుక తవ్వకాలు రద్దయినా ఆగని అక్రమ రవాణా

జిల్లాలోని మంజీరా నది పరివాహక ప్రాంతంలో లక్షల టన్నుల ఇసుక అక్రమ విక్రయాలపై ప్రభుత్వం ఆరు నెలల కింద కొరడా ఝులిపించింది. ఇసుక క్వారీల కాంట్రాక్టర్‌లు, టీజీఎండీసీ సిబ్బంది కుమ్మక్కై ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి కోట్లు దండుకున్న వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు క్వారీల్లో తవ్వకాలను నిలిపివేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో బిచ్కుంద, బీర్కూర్ మంజీరా పరివాహక ప్రాంతంలో ఇసుక తవ్వకాలకు గత ప్రభుత్వంలో అనుమతులు వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఇటీవల 2,3 క్వారీల్లో తవ్వకాలకు టీజీఎండీసీ అనుమతి ఇచ్చింది. ఈ తవ్వకాల్లో కాంట్రాక్టర్‌లు భారీగా అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో తేలడంతో ఆ క్వారీల అనుమతులు రద్దు చేసి తవ్వకాలు నిలిపివేయాలని ప్రభుత్వం ఆరు నెలల క్రితం ఆదేశాలు జారీ చేసింది. అయితే మంజీరాలో ఇసుక తవ్వకాలు మాత్రం ఆగడం లేదు. ఇసుకాసురులు అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు.

హస్గుల్, షెట్లూర్, ఖద్గవ్ మంజీరాలో తవ్వకాలు

జిల్లాలో నిజాంసాగర్, పిట్లం, బిచ్కుంద, బాన్సువాడ, బీర్కూర్ మండలాల మీదుగా మంజీరా ఉంది. ఈ మంజీరా నదిలో చాలానే ఇసుక క్వారీలు ఉండేవి. గతంలో ఈ క్వారీల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారన్న ఆరోపణలతో ప్రభుత్వం ఆంక్షలు విధించింది. కేవలం ప్రభుత్వ పథకాల నిర్మాణాలకు మాత్రమే ఇసుక తవ్వకాలు అనుమతించారు. మంజీరా నదిలో ప్రభుత్వ అభివృద్ధి పనుల పేరిట అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించిన అధికారులు ఇసుక తవ్వకాలను నిలిపివేశారు. ఇలా కొన్ని రోజుల పాటు మంజీరాలో ఎలాంటి ఇసుక తవ్వకాలు జరుగలేదు. అయితే ఇటీవల భారీ వర్షాలు కురువడంతో మంజీరాలోకి భారీగానే వరద పోటెత్తింది. నదిలో నీటి ప్రవాహం ఉన్నప్పటికీ ఇసుకాసురులు బరి తెగిస్తూ రాత్రుల్లో గుట్టుగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. ప్రధానంగా బిచ్కుంద మండల పరిధిలోని హస్గుల్, షెట్లూర్, ఖద్గవ్ మంజీరాలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తూ శివారు గుట్టల ప్రాంతాల్లో గుట్టుగా డంపులు చేస్తున్నారు. రాత్రికి రాత్రే ట్రాక్టర్‌లు, టిప్పర్లలో ఆ ఇసుకను నింపి యథేచ్ఛగా తరలిస్తున్నారు.

రాత్రుల్లో గుట్టుగా బిచ్కుంద మీదుగా రవాణా

జిల్లా సరిహద్దు అయిన పొరుగు జిల్లాకు చెందిన కోటగిరి మండలం పొతంగల్ మంజీరా నదిలోనే కాకుండా బిచ్కుంద మండలంలోని హస్గుల్, ఖద్గవ్, షెట్లూర్‌లో స్థానికంగా ఉండే కొందరు చోటామోటా నాయకులు అక్రమంగా ఇసుకను తవ్వుతూ స్థానికంగా భారీగా డంపులు ఏర్పాటు చేస్తున్నారు. రాత్రికి రాత్రే ట్రాక్టర్‌ల ద్వారా మంజీ రా నది గుండా బీర్కూర్, బిచ్కుంద మీదుగా తరలిస్తున్నారు. బిచ్కుంద మండల కేంద్రం మీదుగా జాతీయరహదారి ఉండడంతో గుట్టుగా పొతంగల్ నుంచి బిచ్కుంద మీదుగా ఇసుక లారీలను జాతీయ రహదారిపైకి ఎక్కించి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా బిచ్కుంద మీదుగా వెళ్తున్న మూడు ఇసుక టిప్పర్‌లను పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు.

ముడుపులు ఇచ్చిన ఇసుక ట్రాక్టర్లను వదిలేస్తున్నట్లు ఆరోపణలు

బిచ్కుంద, బీర్కూర్ మంజీరా పరివాహక ప్రాంతంలో రాత్రుల్లు ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. అయితే ఈ దందా అంతా స్థానికంగా ఉండే రెవెన్యూ, పోలీసు, చోటామోటా నాయకుల అండతోనే సాగుతుందనే ఆరోపణలు వస్తున్నాయి. గతంలో ఇసుక రీచ్‌లు కొనసాగుతున్న సమయంలో

ముడుపులకు అలవాటు పడిన స్థానికంగా ఉండే రెవెన్యూ, పోలీసు సిబ్బంది కొందరు అధికారులు ఇసుక అక్రమ రవాణాకు వత్తాసు పలుకుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అధికారికంగా ఇసుక రీచ్‌లు నడవకపోవడంతో ముడుపులకు అలవాటు పడిన కొందరు అధికారులు, సిబ్బంది ఇసుక అక్రమ రవాణాకు అండగా ఉంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మంజీరాలో ప్రతిరోజూ అక్రమంగా ట్రాక్టర్‌ల ద్వారా ఇసుక తవ్వకాలు జరిపి రవాణా జరుపుతున్నా పోలీసు, రెవెన్యూ సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ముడుపులు ఇచ్చిన ఇసుక ట్రాక్టర్‌లను వదిలేస్తున్నారని డబ్బులు ఇవ్వని వాటిని రెవెన్యూ, పోలీసు సిబ్బంది పట్టుకుని సీజ్ చేస్తున్నట్లు స్థానికుల నుంచి విమర్శలు వస్తున్నాయి. అడపాదడపగా రెండు, మూడు ఇసుక ట్రాక్టర్‌లను పట్టుకుంటున్నామని గొప్పగా చెబుతున్నారే తప్ప క్షేత్రస్థాయిలో మాత్రం ఇసుక తవ్వకాలను పోలీసు, రెవెన్యూ అధికారులు అడ్డుకోవడం లేదని స్థానిక గ్రామస్థుల నుంచి ఆరోపణలు ఉన్నాయి.

భూముల సమస్యలకు

పరిష్కారం చూపాలి

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

కామారెడ్డి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అటవీ భూమి సరిహద్దులకు ఆనుకొని ఉన్న వ్యవసాయ భూముల సమస్యలకు పరిష్కారం చూపాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అసెంబ్లీలో మాట్లాడారు. గిరిజన ప్రజలకు, అటవీ అధికారులకు మధ్య తరచూ వివాదాలు ఉత్పన్నమవుతున్నందు వల్ల రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన శాశ్వత పరిష్కారం కోసం ఈ సమస్య సభ దృష్టికి తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని రాజంపేట మండల ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీసీ రైతులు గత 30ఏళ్ల నుంచి అటవీ భూముల సరిహద్దులకు అనుకొని ఉన్న వ్యవసాయభూముల్లో కాస్తులో ఉండి వ్యవసాయం చేసుకుంటున్నారని తెలిపారు. బీసీ సామాజిక వర్గానికి చెందినందున వారికి గతంలో ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు జారీచేయలేదని అన్నారు. గత సంవత్సర కాలంగా అటవీశాఖ అధికారులు వారిని ఆ భూముల నుంచి ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారని దీని వల్ల కాంగ్రెస్ పార్టీకి చెడ్డపేరు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం గాంధారి మండలం గౌరారం గ్రామంలో 627 సర్వే నెంబర్‌లో రైతులకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే పట్టాలు జారీ చేసిందని గత ప్రభుత్వం ఎల్‌ఆర్‌యూపీ కార్యక్రమం తర్వాత రైతులకు మళ్లీ పట్టాలు అందించలేదని తెలిపారు. లింగంపేట మండలానికి చెందిన నల్లమడుగు తండాకు చెందిన గిరిజన రైతు లక్ష్మణ్‌నాయక్ తాను 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పోడు భూమికి పట్టా పాస్‌బుక్ ఇవ్వకపోవడంతో ఆత్మహత్యా యత్నం చేశాడని తెలిపారు. గాంధారి మండలంలో కాయితీ లంబాడీలు బీసీ సామాజిక వర్గంలోకి వస్తారని వారు సాగు చేసుకుంటున్న పోడు భూములకు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలను జారీ చేయలేదని తెలిపారు. ఈ సమస్యలన్నింటిని ప్రభుత్వం పరిష్కరించాలని అసెంబ్లీలో మాట్లాడారు.

గంజాయి నిర్మూలనకు కృషి చేస్తున్నాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కామారెడ్డి టౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): 'గంజాయి మత్తులో యువత' అనే కథనానికి గురువారం ఎక్సైజ్ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లాలో జనవరి నుంచి అన్ని ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌ల పరిధిలో గంజాయి నిర్మూలనకు కృషి చేస్తున్నామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ హన్మంత్‌రావు తెలిపారు. మొత్తం 6 గంజాయి కేసులు నమోదు చేసి 7 గురిని అరెస్టు చేశామని వారి వద్ద నుంచి 8.33 కిలోల గంజాయి, 4 మొక్కలు, ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ సంవత్సరం 17 మందిని బైండోవర్ చేశామన్నారు. జిల్లా పరిధిలోని గ్రామ కార్యదర్శి గ్రామస్థాయి అధికారులకు రెవెన్యూ సిబ్బందికి పంటలు విత్తన దశలోనే నోటీసులు ఇచ్చి గంజాయి సాగు సమాచారం మాకు వెంటనే తెలపాలని సూచించామని తెలిపారు. అదేవిధంగా గత సంవత్సర కాలంగా జిల్లాలో గుడుంబా కేసులు నమోదు కాలేదని తెలిపారు.

బూత్ కమిటీ అధ్యక్షుల ఎన్నిక

మాచారెడ్డి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని లచ్చపేట గ్రామంలో బీజేపీ 43వ బూత్ అధ్యక్షుడిగా స్వామి, 44వ బూత్ అధ్యక్షుడిగా భూపతి ప్రశాంత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వేణు, మండల అధ్యక్షుడు సురేష్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో జిల్లా ముందుంటుంది

కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో జిల్లా ఎప్పుడు ముందుంటుందని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం కామారెడ్డి కలెక్టరేట్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, తెలంగాణ విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న స్కూల్ ఎర్త్ క్లబ్-యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రాంలో భాగంగా లీడ్ ఎర్త్ లీడర్స్ కాంక్లేవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజీఆర్ సంస్థ విద్యార్థులను భాగస్వాములను చేసి చేపట్టిన పర్యావరణ కార్యక్రమాలను అభినందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులందరూ వారివారి పాఠశాలల్లో పల్లెల్లో కలిసి కట్టుగా పర్యావరణ సంరక్షణలో పాల్గొని జిల్లాను ఉన్నత స్థాయిలో ఉంచేందుకు కృషి చేయాలని తెలిపారు. సీజీఆర్ అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఒక గొప్ప సంకల్పంతో ప్రారంభించిన ఈ కార్యక్రమం ఈ స్థాయిలో విజయవంతం కావడానికి ముఖ్యకారణం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే అని అన్నారు. విద్యార్థులతో ఈ సమన్వయం ఇలాగే ఉంటే త్వరలోనే రాష్ట్రాన్ని పచ్చగా మార్చగలమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాజు, డీఆర్‌డీవో పీడీ సురేందర్, జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి, ఫారెస్ట్ డివిజన్ ఆఫీసర్ రామకృష్ణ, జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ జ్యోతి, డీఏవో తిరుమల ప్రసాద్‌లు హాజరయ్యారు.

మున్సిపల్ పరిధిలో పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగించాలి

మున్సిపల్ పరిధిలోని పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో శానిటేషన్, ఇందిరమ్మ ఇళ్ల సర్వే, పన్నుల వసూళ్లు, అమృత్ పథకం, ఇంజనీరింగ్ పనులు, నర్సరీల్లో మొక్కల పెంపకం, వీధి లైట్లు, ఇంటింటి చెత్తసేకరణ, ప్రకటన పన్నుల వసూళ్లు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో శానిటేషన్ పనులు నిరంతరం కొనసాగించాలని ఇంటింటి చెత్త సేకరణ వందశాతం జరగాలని తెలిపారు. ముఖ్యంగా కమర్షియల్ ప్రాంతాల్లో చెత్తను రోజువారి తీయాలన్నారు. నాటిన మొక్కలకు వాటరింగ్ చేయాలని, రూట్ వారిగా సిబ్బందికి డ్యూటీలు వేయాలని సూచించారు. రెగ్యులర్‌తో పాటు పెండింగ్ ఏరియర్స్ కూడా వసూలు చేయాలని సూచించారు. అలాగే ట్రేడ్ లైసెన్స్‌ల పన్నుల వసూళ్లు చేయాలన్నారు. నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కింద మంజూరైన నిధులతో పనులు పూర్తిచేసి ఫొటోలు, నిధుల ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని సూచించారు. అధికారికంగా హోర్డింగ్ ఏర్పాటు చేసినట్లు గమనించామని వాటిని తొలగించాలని ప్రకటన పన్నులు వసూలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్‌లు శ్రీహరి, స్పందన, మున్సిపల్ ఇంజనీర్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

---

100 శాతం ఉత్తీర్ణతకు 90 రోజుల ప్రణాళిక

ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి శేఖ్ సలాం



లింగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను ప్రశ్నిస్తున్న నోడల్ అధికారి శేఖ్‌సలాం

లింగంపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్‌లో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కమిషన్ ప్రవేశపెట్టిన 90 రోజుల ప్రణాళికను అమలు చేయాలని ఇంటర్ జిల్లా నోడల్ అధికారి శేఖ్ సలాం అన్నారు. ఆయన గురువారం లింగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాల, జ్యోతిబాపూలే గురుకుల కళాశాల, కస్తూర్బా కళాశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లెక్చరర్లు ఈనెల చివరిలోపు సెలబస్ పూర్తి చేసి ప్రతీ రోజు విద్యార్థులకు సెలబస్ రివిజన్‌తో పాటు సబ్జెక్టులోని ఒక ప్రశ్నకు జవాబు రాసేవిధంగా టెస్ట్ పెట్టి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక దృష్టి పెట్టి చదివించాలని ఆయన తెలిపారు. కళాశాలకు రెగ్యులర్‌గా హాజరుకాని విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా, అవసరమైతే వారి ఇంటికి వెళ్లి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి విద్యార్థులను కళాశాలకు రప్పించాలని ఆయన తెలిపారు. కళాశాలలోని విద్యార్థుల అడ్మిషన్, హాజరు, మార్కుల రిజిస్టర్‌లను ఆయన పరిశీలించారు. విద్యార్థులను ఆయా సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నాలను అడిగి వారి ప్రతిభను తెలుసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్, లెక్చరర్లు శివ, రాజయ్య, నాగు, ధర్‌సింగ్ స్వామిగౌడ్, శ్రీకాంత్, అంజమ్మ, వాణి, రజాక్, అభినవ్, నాగయ్యలతో పాటు విద్యార్థులు ఉన్నారు.

కామారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా

స్పందన బాధ్యతల స్వీకరణ



అదనపు కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న కమిషనర్

కామారెడ్డి టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా హెచ్‌ఎం. స్పందన గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో సంగారెడ్డి మెప్మా పీడీగా పని చేసిన ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అదేవిధంగా మున్సిపల్‌లోని ఆయా వార్డులకు 34 మంది వార్డు ఆఫీసర్‌లను ప్రభుత్వం కేటాయించగా 14 మంది వార్డు ఆఫీసర్‌లు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్‌లను కేటాయించగా ఒకరు విధుల్లో చేరారు.

ఉచిత స్వయం ఉపాధి శిక్షణ

కామారెడ్డి టౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అజ్మీరి సొసైటీ మూడు నెలల ఉచిత స్వయం ఉపాధి శిక్షణ, బ్యూటీషియన్‌కోర్సును నిరుద్యోగ పేద, మైనార్టీ మహిళలకు అందిస్తున్నట్టు జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి దయానంద్ తెలిపారు. అభ్యర్థులు మైనార్టీ వర్గానికి చెందినవారై 18 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సు గలవారై 10వ తరగతి లోపు చదువుకొని ఉండాలని తెలిపారు. కుటుంబ వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాల వారికి రూ.2లక్షల లోపు, గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50లక్షల లోపు ఉండాలని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 24లోపు మైనార్టీ సంక్షేమాధికారి కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసు కళా బృందం సభ్యురాలు

మద్నూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై కామారెడ్డి పోలీసు కళాబృందం కళాకారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. మద్నూరు మండల కేంద్రంలోని తెలంగాణ గురుకుల బాలుర విద్యాలయం జూనియర్ కళాశాలలో గురువారం కళాబృందం వారు సాంకేతిక సైబర్ నేరాలపై, షీటీం గురించి, డ్రగ్స్‌పై ట్రాఫిక్ పోలీసురూల్స్ గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెస్ ప్రభాకర్ మాట్లాడుతూ సమాజంలోని యువత సైబర్ నేరాలను పసిగట్టా లని, ఇంట్లో తల్లిదండ్రులకు, అక్కా చెల్లెళ్లకు అవగాహన కల్పి ంచాలని విద్యార్థులకు సూచించారు. సమాజంలో జరుగుతున్న యదార్థ సంఘటనలను కొన్నింటిని ఉదాహరించి కథా రూపంలో చెప్పారు. బాన్సువాడ షీ టీం సభ్యురాలు ప్రియాంక మాట్లాడు తూ మహిళల పట్ల, అక్కా, చెల్లెళ్ల పట్ల అసభ్యకరంగా ఎవరైనా ప్రవర్తిస్తే 100 నెంబర్‌కు డయల్ చేయాలని, వెంటనే షీ టీం వచ్చి నేరగాళ్లను పట్టుకుంటారని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు పడవద్దని, మంచిని గ్రహించాలని, చెడును వదిలిపెట్టాలని అన్నారు. మద్నూరు ఏఎస్ఐ సుధాకర్ మాట్లాడు తూ రోడ్లపై నడిచే ప్రజానీకం, వివిధ వాహనాలను నడిపేవారు ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని అన్నారు. విద్యార్థులు అన్ని విష యాలను తెలుసుకోవాలని, విద్యలో బాగా రాణించాలని అన్నారు. అన్ని విధాలుగా పోలీసులు రక్షణ ఉంటారని, ఏ విషయమైనా నిర్భయంగా పోలీసులకు ఫోన్ చేసి చెప్పవచ్చని పేర్కొన్నారు. కళా బృందం సభ్యులు సాయిలు, ఎం.అనిల్, ప్రిన్సిపాల్ యన్.గంగా కిషోర్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ సుమన్, ప్రముఖ పద్యకవి, వ్యాఖ్యాత, సంస్కృత ఉప న్యాసకులు బి. వెంకట్, ఉపాధ్యాయులు, వేణుగోపాల్, నరహరి, ప్రసాద్, జీగణేశ్, సంతోష్, రాము, నాగేంద్ర, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలు, సైబర్ నేరాల పట్ల అవగాహన



పోలీసు లోగోను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): కొత్త చట్టాలు, సైబర్ నేరాల పట్ల ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. గురువారం బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ ప్రభుత్వ పాఠశాలలో బోధన్ డివిజన్ షీటీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పోలీసు సిబ్బంది విజయ్, సుజాతలు మహిళలపై జరిగే నేరాల గురించి టీ సేఫ్ యాప్, డయల్ 100, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, కొత్తచట్టాలపై, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులకు ఓటీపీ నెంబర్లు చెప్పవద్దన్నారు. రకరకాల మెస్సేజ్‌లతో సైబర్ నేరగాళ్లు ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని, సైబర్ నేరాల ఫోన్‌కాల్స్‌పై జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం పోలీసు లోగోను ఆవిష్కరించారు.ఈకార్యక్రమంలో షీటీమ్ సిబ్బంది, పోలీసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్ చేస్తే షీటీంకు సమాచారం ఇవ్వాలి

ముప్కాల్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిం చిన, ఈవ్‌టీజింగ్ చేసిన షీటీంకు సమాచారం ఇవ్వాలని సబ్ డివిజన్ కానిస్టేబుల్ విగ్నేష్ సూచించారు. గురువారం బాల్కొండ మండలంలోని చిట్టాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ క్రైంలపై షీటీం అవగాహన కల్పించారు. షీటీం ని రంతరం నిఘా ఉంటుందని, విద్యార్థులు, ఉద్యోగిని మహిళలు వేధింపులకు గురైన ప్పుడు షీటీం నెంబర్ 8712659795 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని, ఈవ్‌టీజింగ్‌లకు గురైనప్పుడు భయపడకుండా సమా చారం ఇస్తే రక్షణ కల్పిస్తామని వారు తెలిపారు. 100 డయల్ లేదా క్యూఆర్ కోడ్ ద్వారా షీటీంకు ఫిర్యాదు చేయవచ్చని విద్యార్థినిలకు సూచించారు. ఈ సందర్భంగా షీటీం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సుమతి, రాజ్‌పాల్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్; రాంరెడ్డి, పద్మ, రాజేందర్, తదిత రులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన



కందకుర్తిలో సర్వే వివరాలు పరిశీలిస్తున్న తహసీల్దార్

రెంజల్,డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ పథకం ద్వారా అర్హులైన లబ్దిదారుల వివరాల కోసం నిర్వహిస్తున్న సర్వేను తప్పులు లేకుండా నమోదు చేయాలని తహసీల్దార్ శ్రావణ్ కుమార్ అన్నారు. గురువారం సాటాపూర్, నీలా, పేపర్‌మిల్, కందకుర్తి గ్రామాలలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు మహబూబ్ అలీ, సాయిలు, భాస్కర్, జూనియర్ అసిస్టెంట్ గౌతం, కారోబార్ షాజీద్ తదితరులున్నారు.

కోటగిరి: కోటగిరి మండలంలోని కొత్తపల్లి, దేవుని గుట్ట తండా గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల యాప్ సర్వేను గురువారం తహసీల్దార్ గంగాధర్ పరిశవీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరిని ఇందిరమ్మ ఇళ్ల సర్వే యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. సర్వే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

రైతు బజార్ పరిశీలన



రైతు బజార్ మడిగెలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంగడిబజార్‌లో నిర్మించిన రైతు బజార్ నూతన మడిగెలను గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్ పరిశీలించారు. రైతులకు మడిగెల కేటాయింపు కొరకు టెండర్‌లు పిలువగా 25మంది టెండర్‌లో పాల్గొన్నారని, జనవరి 1నుంచి రైతులకు మడిగెలు కేటాయిస్తామని ఆమె తెలిపారు. రైతు బజార్‌లో ప్లాస్టిక్ వాడకాలను నిషేదిస్తున్నామని, ప్లాస్టిక్‌గా బదులుగా జూట్ బ్యాగులు, బట్ట సంచులు వాడాలని సూచించారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ రాజు, డీఈ భూమేశ్వర్; తదితరులు పాల్గొన్నారు.

కళ్యాపూర్‌లో గడ్డివాము దగ్ధం



దగ్ధమవుతున్న గడ్డివాము

రెంజల్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళ్యాపూర్ గ్రామానికి చెందిన బోర్గాం జలయ్య అనే రైతుకు చెందిన గడ్డివాము పూర్తిగా దగ్ధమైంది. గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివాము దగ్ధం చేసి ఉంటారని ఆయన తెలిపారు.పశువుల మేత కోసం 350గడ్డి కట్టలను పశుగ్రాసం ఉంచగా గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించి ఉంటారని ఆయన తెలిపారు. గడ్డివాము పూర్తిగా కాలిపోవడంతో పశువులకు పశుగ్రాసం ఇబ్బందిగా మారిందన్నారు. గడ్డివాముకు నిప్పంటించిన అనుమానితులపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు జలయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



లక్ష్మణ్(ఫైల్)

మోస్రా,డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ మండలం మల్లారం అటవీ ప్రాంతంలో టాటా ఏస్, ద్విచక్ర వాహనం ఢీకొని మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. రూరల్ పోలీసు స్టేషన్ ఎస్సై ఆరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం మోస్రా మండల కేంద్రానికి చెందిన కొత్తిమీర్‌కర్ లక్ష్మణ్ తండ్రి మోహన్ మోస్రాలో మొబైల్ షాప్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం మొబైల్ షాప్‌కు సంబంధించిన సామాను నిమిత్తం మోస్రా నుంచి నిజామాబాద్‌కు వెళ్తున్న సమయంలో మల్లారం గండి వద్ద అశోక్ లేలాండ్ ట్రాలీ డ్రైవర్ తన వెహికిల్ అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి లక్ష్మణ్ నడిపిస్తున్న ద్విచక్రవాహనానికి ఢీ కొనగా లక్ష్మణ్ తలకు, ఇతర చోట్ల గాయాలయ్యాయి. 108అంబులెన్సుకు సమాచారం అందించగా హాస్పిటల్ తరలించే సమయంలో లక్ష్మణ్ మృతి చెందారు. మృతుని యొక్క అన్న కొత్తిమీర్‌కర్ రాహుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్సై ఆరీఫ్ తెలిపారు.

ఆలయ నిర్మాణానికి లక్ష రూపాయల విరాళం

కమ్మర్‌పల్లి, డిసెంబరు 19: (ఆంధ్రజ్యోతి) మండలకేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయ పూర్తిస్థాయి నిర్మాణం నిమిత్తం కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన ఎన్నారై(యూఎస్ఏ) చింత బలరాం తమవంతుగా లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. కమ్మర్‌పల్లిలో నిర్మాణంలో ఉన్న ఆలయన్ని గురువారం ఆయన తన సోదరుడు చింత హన్మంతుతో కలిసి సందర్శించి పరిశీలించారు. ఈ మేరకు ఆలయ నిర్మాణ బాధ్యులకు లక్ష రూపాయల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ వైద్యుడు చింత హనుమంతు, బద్రీ, బద్దం రాజశేఖర్, తదిత స్థానిక అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

మాల మహానాడు నాయకుల ముందస్తు అరెస్టు

బోధన్‌రూరల్,డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): మాల మహానాడు నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం సరికాదని మాల మహనాడు జిల్లా అధ్యక్షుడు ఆనంపల్లి ఎల్లమయ్య అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య పిలుపు మేరకు ఛలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో భాగంగా గురువారం తెల్లవారుజాము నుంచి బోధన్ పోలీసులు పట్టణంలోని మాల మహనాడు నాయకులను ముందస్తు అరెస్టు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మాల మహానాడు నాయకులు ముందుండి ఓట్లు వేసి గెలిపించారని, ప్రభుత్వానికి మద్దతు ఇవ్వకుండా మనువాదులకు సపోర్ట్ చేసిన నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వం వత్తాసు పలకడం సరైంది కాదన్నారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ బద్దంగా జరిగేంత వరకు తమ పోరాటం కొనసాగిస్తామన్నారు. రాష్ట్రంలో దళితుల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ల శాతం పెంచేందుకు కృషి చేయాలని కోరారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో నవీపేట మాజీ ఎంపీపీ సంగం శ్రీనివాస్, మాల మహనాడు రాష్ట్ర కార్యదర్శి నీరడి ఈశ్వర్, బోధన్ డివిజన్ ఉపాధ్యక్షులు కారం స్వామి, వల్లాటి యాదగిరి, శ్రీనివాస్ తదితరులున్నారు.

డొంకేశ్వర్: మాలమహానాడు నాయకులను పోలీ సులు ముందస్తుగా అరెస్టు చేశారు. మాలమహానాడు రాష్ట్ర నాయకుల పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడిలో భాగంగా వీరిని అరెస్టు చేశారు. డొంకేశ్వర్ మండలంలో ఉన్న మాల మహానాడు ఐదుగురు నాయకులను గురువారం ఉదయం 4గంటలకు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో మాలమహానాడు నాయకులు సుంకరి నాగరాజ్, పోగరి సంజీవ్, రాజేశ్వర్, రాము, రాజేష్, ఉన్నారు.

ఏర్గట్ల: ఎస్సీవర్గీకరణలో భాగంగా తమకు న్యాయం జరిగే వరకు పోరాడతామని మాల మహానాడు మండల అధ్యక్షుడు గన్నారం రాజేశ్వర్ అన్నారు. గురువారం ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా తలపెట్టిన చలో అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా పోలీసులు వారిని ముందస్తు అరెస్టు చేశారు. ఈ కార్యక్రమంలో దిబ్బ సుదర్శన్, కుండ చక్రి,ఈర్గల గణేష్,నాగార్జునలు ఉన్నారు.

నవీపేట: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా గురువారం చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొనకుండా పోలీసులు పలువురు మాల మహానాడు నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాల మహానాడు నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. ఈ కార్యక్రమంలో బుచ్చన్న, సాయిలు, సతీష్, రాజు, శ్యామ్ తదితరులున్నారు.

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధితో పాటు వివిధ గ్రామాల్లో ఉన్న మాలమహానాడు నాయకులను స్థానిక పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర నాయకుడు అర్గుల్ సురేష్ మాట్లాడుతూ రాష్ట్రపిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా ముందస్తు అరెస్టు చేయడం అన్యాయమని రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్రంగా ఖండించారు. అరెస్టులతో ఉద్యమం ఆగదని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు మాలలు ఎంతో సహకరించారని, ఆ విషయం మరిచిపోతున్న సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణ విషయంలో మరోసారి ఆలోచించాలని, విజ్ఞప్తి చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తీవ్రతరం చేస్తామని తెలిపారు. అరెస్టు అయిన వారిలో మాల మహానాడు నాయకులు అగ్గు క్రాంతి, ఆలూర్ ఉదయ్, జాదవ్‌రాజు, అనువతి రమేష్ కైలాస్, బేగరి రాకేష్, నీరడి దీపక్, తదితరులు ఉన్నారు.



బోధన్ పోలీస్ స్టేషన్‌లో మాల మహానాడు నాయకులు



ఆర్మూర్‌లో ముందస్తు అరెస్టు అయిన మాలమహానాడు నాయకులు



డొంకేశ్వర్‌లో..



నవీపేటలో..

అదనపు గదుల నిర్మాణ పనుల ప్రారంభం

ఏర్గట్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చిన్నరేండ్ల ముది రాజ్ సంఘానికి రూ.5లక్షలు, అలాగే గుండాల ముదిరాజ్ సంఘానికి రూ.2లక్షల50వేలు అదనపు గదుల నిర్మాణానికి ఎస్డీఎఫ్ ద్వారా నిధులు మంజూరు కాగా గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు భూమిపూజ చేసి పనులను ప్రారంభిం చారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ అడిగిన వెంటనే నిధుల మంజూరు కృషి చేసిన బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కు మార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, బద్దం లింగారెడ్డి, గడ్డం జీవన్, పన్నాల నర్సా రెడ్డి, ముస్కు మోహన్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

'బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి'

వేల్పూర్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ద్వారా అందే సేవలను ప్రజలు వినియోగించుకోవాలని టీజీపీ బ్యాంక్ చైర్మన్ వై.శోభ అన్నారు. గురువారం వేల్పూర్ మండలంలోని రామన్నపేట్ గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ద్వారా లోన్‌మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బ్యాంక్‌చైర్మన్ శోభ మాట్లాడుతూ తమ బ్యాంకు ద్వారా హౌసింగ్, అగ్రికల్చర్, వెహికిల్, బిజినెస్, గోల్డ్ లోన్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ డీవీఎస్ రామారావు, స్థానిక బ్యాంకు మేనేజర్ చంద్రకాంత్ రెడ్డి, ఖాతాదారులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో ఎయిడ్స్‌పై అవగాహన



ఎయిడ్స్‌పై చిత్రప్రదర్శన ద్వారా అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కమ్మర్‌పల్లి, డిసెంబరు 19: (ఆంధ్రజ్యోతి) మండలకేంద్రంలో గురువారం మహమ్మారి ఎయిడ్స్‌పై చిత్రప్రదర్శన ద్వార అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాజీ ఎంపీటీసీ షైలారం సుధాకర్ మాట్లడుతూ.. ప్రతీఒక్కరు మహమ్మారి ఎయి డ్స్ పట్ల అవగాహన పెంచుకుంటూ ఈవ్యాధి బారిన పడకుండా పదిగురికి అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఎయిడ్స్ వ్యాప్తి, నివారణ చర్యలు, తీసుకోవాలసిన ముందస్తు జాగ్రత్తలు తదితర అవశాలపై స్థానిక గ్రామపంచాయతీ వద్ద చిత్రప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైఆర్‌జీ కేర్ లింక్ వర్కర్ రాజ్ కుమార్, స్థానికులు అనిల్, గంగాధర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌ను అవమానపర్చడం సమంజసం కాదు

ఆర్మూర్‌టౌన్,డిసెంబరు19(ఆంధ్రజ్యోతి):కేంద్రం హోంశాఖ మంత్రి అమిత్ షా అంబేద్కర్‌ను అవమానించడం సమంజసంకాదని మాదిగ సంఘా లు, ఉపకులాల సంఘాల నాయకులు ఖండించారు. గురువారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర మంత్రి అయిన అమిత్‌షా అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే మంత్రి పదవులు పొందారని, ఒక పక్క ప్రధాన మంత్రి, అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే ప్రపంచ దేశాల్లో భారత రాజ్యాం గం ప్రజాస్వామిక దేశంగా గుర్తింపు వచ్చిందని చెబుతుండగా, అమిత్‌షా రాజ్యాంగాన్ని అవమానించడం సరికాదని, తక్షణమే భారతజాతికి క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న, నాయకులు మోతె భూమన్న, బచ్చేపల్లి దేవయ్య, ఎర్రోల్ల మల్కన్నమేతరి సాయన్న, నర్సింలు, పోశన్న, సురేష్, చిట్టిబాబు, గంగారాం గణేష్, తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గురువారం మండలంలోని సాటాపూర్ చౌరస్తాలో బహుజన సంఘాల ఆధ్వర్యంలో అమిత్ షా దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహనాడు యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్, మాల మహనాడు జిల్లా యూత్ ఉపాధ్యక్షులు గైని కిరణ్, గోసంగి సంఘం జిల్లా యూత్ అధ్యక్షుడు పత్రి సురేష్, జిల్లా బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు సిరివేసు సంతోష్, మాల మహనాడు మండల మాజీ అధ్యక్షులు రాందాస్, లోక కృష్ణ, శ్రీకాంత్, రాజశేఖర్, రాకేష్, సరిదాస్, సల్మాన్, చంద్రకాంత్, శ్రీను, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యాలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను అంబేద్కర్ యువజన నాయకులు దహనం చేశారు. గురువారం జక్రాన్‌పల్లి మండలం బ్రాహ్మణ్‌పల్లిలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేసి అంబేద్కర్ యువజన సంఘం నాయకులు నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ్‌పల్లి మాజీ సర్పంచ్ దేవరాజ్, మాజీఎంపీటీసీ రాజు, అంబేద్కర్ యువజన నాయకులు సాగర్; అరుణ్, లక్ష్మణ్, సతీష్, ప్రభాకర్, సత్యనారాయణ, అనిల్, రాజ్‌కుమార్, సురేందర్, ప్రవీన్, సంజీవ్, తదితరులు ఉన్నారు.

వేల్పూర్: వేల్పూర్ మండలం పడిగెల గ్రామంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దళితులు దహనం చేశారు. పార్ల మెంట్‌లో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని దళిత సంఘం డిమాండ్ చేస్తూ గ్రామ ఎస్సీ సంఘం ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో డప్పువాయిద్యాల మధ్య ప్రధాన వీధుల గుండా అమిత్‌షా దిష్టిబొమ్మను శవయాత్ర నిర్వహించి అంబేద్కర్ విగ్రహం వద్ద దహనం చేశారు. పార్లమెంట్‌లో అంబేద్కర్ పేరును పలకడం ఫ్యాషన్ అయ్యిందని అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను తీవ్రస్థాయిలో వ్యతిరేకించారు. భారత రాజ్యాంగ నిర్మాతను అగౌరపరిచేలా మాట్లాడినందుకు అమిత్‌షా భారత ప్రజలందరికి క్షమాపణ చెప్పాలని ఎస్సీ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ గురువారం కమ్మర్‌పల్లి మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పులమాలలు వేసి నిరసన కార్యక్రంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెట రవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడెంగంగాప్రసాద్ ఏఎంసి ఉపాధ్యక్షుడు సుంకెట బుచ్చన్న, నిమ్మ ప్రసాద్, ప్రదీప్, పాష, శేఖర్, గణేష్ గౌడ్, సుంకెట శ్రీనివాస్, అజారోద్దీన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మెండోర: బాబాసాహెబ్ అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలతో దేశప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయని వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సం దర్భంగా బాబాసాహెబ్ అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు బీజేపీ అహంకారానికి నిదర్శనమని విమర్శించారు.అంబేద్కర్‌ను అవమానించినం దుకు అమిత్‌షా వెంటనే క్షమాపణ చెప్పి మంత్రి పదవికి తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



ఆర్మూర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మాదిగ సంఘ నాయకులు



రెంజల్‌లో..

బాధిత కుటుంబాలకు సునీల్‌కుమార్‌రెడ్డి పరామర్శ

భీమ్‌గల్‌రూరల్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి):బడాభీమ్‌గల్‌లో ఎంజీతండా పరిధిలోని భూక్యతాండాకు చెందిన మో తీలాల్ ఇళ్లు ఇటీవల ప్రమాదవశాత్తు షాట్‌సర్క్యూట్‌కు గురై పూర్తిగా కాలిపోయిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ సునీల్‌కుమార్ గురు వారం బాధి త కుటుంబసభ్యులను పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడి గితెలుసుకన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో బాధిత కుటుంబాలను బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ రెడ్డి గురువారం పరామర్శించారు. మండలకేంద్రానికి చెందిన ఒక దినపత్రిక విలేఖరి బోడ్డు శంకర్ తల్లి బొడ్డు రాజాబాయి ఇటీవల మరణించడంతో ఆయనను కు టుంబ సభ్యులను పరామర్శించారు. కాగా కాంగ్రెస్ నాయకుడు సుంకరి రాజేశ్వర్ తండ్రి సుంకరి నర్సయ్య మంరణించడంతో రాజేశ్వర్‌ను ఆయన సోదరుడు సుంకరి మురళిని కుటుంబ సభ్యులను సునీల్ కుమార్ పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుంకెట రవి, ఏఎంసి వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, నాయకులు నిమ్మప్రసాద్, వేముల గంగారెడ్డి సింగిరెడ్డి శేఖర్, పాష, నల్ల సాయికుమార్ కార్యకర్తలు ఉన్నారు.



కుకునూర్‌లో మృతుని కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న సునీల్‌కుమార్

వేల్పూర్: వేల్పూర్ మండలంలోని పలు గ్రామాలలో మృతుల కుటుంబాలను గురువారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ సునీల్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. కుకునూర్ గ్రామానికి చెందిన గంగాధర్ తండ్రి చిన్న గంగారాం ఇటీవల అనారోగ్యంతో మరణిచారు. అలాగే వెంకటాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రిక్క ఆనంద్ వాళ్ల తల్లి భూదేవి ఇటీవలే మరణించింది. ఈ విషయం తెలుసుకున్న సునీల్‌రెడ్డి ఆయా కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని వ్యక్తం చేశారు.

అదుపుతప్పి వాహనం బోల్తా

భిక్కనూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని 44వ జాతీయరహదారిపై చర్చి చౌరస్తా వద్ద టాటాఏస్ వాహనం అదుపుతప్పి బొల్తాపడగా వాహన డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం హైదరాబాద్ వైపు నుంచి కామారెడ్డి వైపు బార్దాన్ లోడ్‌తో వస్తున్న టాటాఏస్ వాహనానికి ద్విచక్రవాహనం అడ్డు రావడంతో డ్రైవర్ సడెన్‌బ్రేక్ వేశాడు. దీంతో వాహనం అదుపుతప్పి బొల్తాపడింది. ఈ విషయం తెలుసుకున్న జీఎం ఆర్ సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బొల్తాపడిన వాహనాన్ని క్రేన్ సహయంతో తీయించి జీఎంఆర్, పోలీసు సిబ్బంది కిందపడిన బార్దన్ సంచులను లోడ్ చేసి పంపించారు. ట్రాఫిక్‌జాం కాకుండా చర్యఉల తీసుకోవడంతో పాటుగా జీఎంఆర్, పోలీసులు వాహనంలోకి సంచులను మోయడంతో వాహనదారులు, స్థానికులు వారిని అభినందించారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెకు మద్దతు

నవీపేట,డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్ల సాధనకు ఈ నెల 9నుండి జిల్లా కేంద్రంలో నిరవధిక సమ్మె చేపడుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులకు మండల పీఆర్‌టీయూ ఉపాధ్యాయులు తమ సంఘీభావం ప్రకటించారు. స్థానిక మోడల్ పాఠశాలలో గురువారం జరిగిన మండల స్థాయి కాంప్లెక్స్ సమావేశానికి హజరైన మండల పీఆర్‌టీయూ ఉపాధ్యాయులు సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెకు మద్దతు ప్రకటించి తమ సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి, ఎంఈవో అశోక్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు భూమయ్య, ప్రధాన కార్యదర్శి శివకుమార్, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

భీమ్‌గల్‌రూరల్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాబానగర్ కాలనీకి చెందిన కుండాల పెద్ద సాయన్న అనే వృద్ధుడు నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు భీమ్‌గల్ ఎస్సై మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 13వ తేదీన రాత్రి మృతుడు కుప్పకంటి గ్రామశివారులో పొలంలో స్పృహ కోల్పోయి ఉన్నాడని వచ్చిన సమాచారం మేరకు అంబులెన్స్‌లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మొదట గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేయగా, భీమ్‌గల్ మండలం బాబానగర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించి వృద్ధుడి భార్య కుండల కసమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

రెంజల్‌లో కూరగాయల సంత ఏర్పాటు



కూరగాయలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

రెంజల్,డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి):రెంజల్ మండల కేంద్రంలో గురువారం కూరగాయల సంతను నూతనంగా గ్రామస్థులు ఏర్పాటు చేశారు. మండల కేంద్రమైన రెంజల్ గ్రామంలో మొదటి సారిగా కూరగాయల సంతను ఏర్పాటు చేయడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి సంతలో కూరగాయలు కొనుగోలు చేశారు. ప్రతి గురువారం రెంజల్ మండల కేంద్రంలో కూరగాయల మార్కెట్‌ను నిర్వహించడం జరుగుతుందని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్థులు తెలిపారు.

ఎల్లారెడ్డి ఎంఈవోకు మెమో జారీ

● ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్

ఎల్లారెడ్డి,డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి):పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఇన్‌చార్జి ఎంఈవోగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశంకు మెమో జారీ చేసినట్లు ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నే ప్రభాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేయగా పాఠశాలలో విద్యార్థినులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం గుడ్డు పెట్టకపోవడం, సమయపాలన పాటించడం లేదని అదే విధంగా ముగ్గురు ఉపాధ్యాయులు రికార్డులలో సీఎల్ అని నమోదు చేశారు. వాటికి సంబంధించిన సెలవు ఉత్తర్వులు లేకపోవడంతో పాటు విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండడంవల్ల మెమో జారీ చేసినట్లు తెలిపారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని పేర్కొన్నారు

భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

భిక్కనూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండల కేంద్రంలోని గ్రామపంచాయతీకి సంబంధించిన భూమిని కొందరు కబ్జా చేశారని వారిపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కర్రోల్ల రాజు డిమాండ్ చేశారు. గురువారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీకి సంబంధించిన శ్మశానవాటిక భూమిని ఇటీవల కొందరు యధేచ్ఛగా చదును చేసి వెంచర్ వేయడానికి సిద్ధమయ్యారని ఆరోపించారు. ఈ స్థలంపై కలెక్టర్, కామారెడ్డి ఎమ్మెల్యే దృష్టిసారించి గ్రామపంచాయతీ భూమిని కాపాడాలని కోరారు. లేనియెడల అందోళన కార్యక్రమాల చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

పెర్కిట్ పాఠశాల తనిఖీ

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో గల మహాత్మజ్యోతిబాపూలే పాఠశాలను గురువారం మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. పాఠశాలలోని వంట గదిని, పరిసర ప్రాంతాలను పరిశీలించి ప్రతీరోజు శుభ్రంగా ఉంచాలని, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డైట్‌మెనును విద్యార్థులకు అందుతుందా లేదా అని విద్యార్థినిలను అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి.సృజన, సానిటరి ఇన్స్‌పెక్టార్ గజానంద్, పూర్ణమౌళి, పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక ఒకరి మృతి

భిక్కనూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని జంగంపల్లి గ్రామంలో కడపునొప్పి భరించచలేక ఒకరు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ గురువారం తెలిపారు.ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బందెల శివరాజు((45) గత కొంతకాలంగా కడుపునోప్పితో బాధపడుతున్నాడు, ఎక్కడా చూపించిన తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది తన కొట్టంలో దులానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని వివరించారు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఉద్యమాల నిర్దిష్ట భావాలను

విద్యార్థులకు తెలియజేయాలి

» తెలుగు సదస్సులో ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింతకింది కాశీం

డిచ్‌పల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషలోని ఉద్యమాల నిర్దిష్ట భావాలను, అక్షర నిర్మాణ క్రమ వికాస దశలను కవులుగా ఉన్న వారు కళ్లకు కట్టిన విధంగా విద్యార్థులకు తెలియజేయాలని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం అన్నారు. తెలంగాణ వర్సిటీలో తెలుగు విభాగం భారతీయ భాషా, సంరక్షణ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం తెలుగు పునశ్చరణ కార్యక్రమం రెండో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రొఫెసర్ చింతకింది కాశీం మాట్లాడుతూ విద్యార్థుల వద్ద తెలుగు నిఘంటువులు ఉండాలన్నారు. ప్రొఫెసర్ యుద్ధనపుడి రెడ్డి శ్యామల మాట్లాడుతూ పదాలను నిర్మించడంలో ఎంపిక జాగ్రత్తగా చేసుకోవాలని సూచించారు. నిఘంటువుల అధ్యయనం లేని చదువులు హృదయానికి దగ్గర కావాలని వివరించారు. గుంటూరు లక్ష్మీ నర్సయ్య మాట్లాడుతూ.. తెలుగు కవిత్వ శిల్ప సౌందర్యం మనోవైజ్ఞానిక, తాత్వికత, ఆంగ్ల సాహిత్య ప్రభావం, లోతైన విశ్లేషణలతో విద్యార్థులకు వివరించారు. ప్రొఫెసర్ లావణ్య మాట్లాడుతూ.. తెలుగు వ్యాస పరిణామ దశలను వివరించారు. అందరూ చిన్న వ్యాసాలు, పెద్ద వ్యాసాలు రాయాలని భాషను ప్రేమతో చెప్పాలని ఆమె వివరించారు. ఈ సదస్సులో పరిశోధకులు పాల్గొన్నారు.



తెలుగు సదస్సులో మాట్లాడుతున్న ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.కాశీం, శ్యామల


మాట్లాడుతున్న లక్ష్మీనర్సయ్య

వణికిస్తున్న చలి


చలి మంటలు కాచుకుంటూ ఉపశమనం పొందుతున్న యువకులు


చలికి తట్టుకోలేక స్వెటర్ ధరించిన వాహనదారులు

డొంకేశ్వర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): డొంకేశ్వర్ మండల వ్యాప్తంగా ఐదు రోజులుగా చలి విజృంభిస్తోంది. చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో బయటికి వెళ్లాలంటే ప్రజలు చలికి అవస్థలు పడుతున్నారు. రోజు రోజుకు చలి తీవ్రత క్రమేపి పెరుగుతూ వస్తుంది. బుధవారం డొంకేశ్వర్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రత 24.0 డిగ్రీలు కాగా కనిష్ఠంగా 16.0 డిగ్రీల సెల్సియస్ నమోదయింది. ఉదయం, సాయంత్రం వేళల్లో మరింతగా చలి పెరుగుతుండడంతో ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ముఖ్యంగా రాత్రుళ్లు చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో అవస్థలు పడుతున్నారు. ఉదయం 9 గంటల వరకు కూడా చలి ప్రభావం ఉండడంతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు. సాయంత్రం 6గంటల నుంచి చలి ప్రభావం కనిపిస్తోంది. శీతల గాలుల కారణంగా పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. చల్లగా వీస్తున్న గాలుల కారణంగా చలి ప్రభావం అధికంగా ఉంటోంది.

ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు..

చలి తీవ్రత పెరగడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ కా ర్యదర్శులు అవస్థలు పడుతున్నారు. పాఠశాలలకు వెళ్లే చిన్నారులపైనా చలి ప్రభావం అధికంగా ఉంటోంది. పాలు, కూరగాయల వ్యాపారులు తెల్లవారు జామున 5 గంటలకే బయటకు వెళ్లాల్సి రావడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఉదయం 10 గంటల వరకు కూడా రోడ్లపైకి జనాలు వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు.

మంచుతో ఇబ్బందులు..

చలికి తోడుగా ఉదయం మంచు ఎక్కువగా చలి మంచు కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివిధ అవసరాల కోసం బయటకు వెళ్లినప్పుడు రోడ్లన్నీ మంచుతో మంచు కప్పబడి వాహనాలపై ప్రయాణం సాగించే సమయంలో చలి తీవ్రత అధికంగా ఉంటోందని ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. ఉదయం 10 గంటలు దాటితే తప్ప సూర్యుడు కనిపించడం లేదు. మరికొందరు చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో చలి నుంచి ఉపశమనం పొందడానికి ఉదయం, రాత్రి వేళల్లో గ్రామాల్లో చలి మంటలు వేసుకుని చలి నుంచి ఉపశమనం పొందుతున్నారు.

జర దేఖో!!


ఆలయం వెనుక ఉన్న మూలమలుపు


పెర్కిట్‌లోని ఆసుపత్రి ఎదురుగా ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

ప్రమాదకరంగా మూల మలుపులు

» పెర్కిట్‌లో సూచికలు, స్పీడ్‌బ్రేకర్లు లేక రోడ్డు ప్రమాదాలు » పట్టించుకోని అధికారులు

పెర్కిట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ రోడ్డుకు వెళ్లే ప్రధాన రహదారితో పాటు ఎంజే ఆసుపత్రి పక్కన పెర్కిట్ వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం చేశారు. ఈ మార్గం గుండా నిత్యం వాహనాలు అధిక ప్రయాణం సాగిస్తాయి. పట్టణంలోని శ్రీ భాషిత, నారాయణ పాఠశాలలు పెర్కిట్ వెళ్లే మార్గంలో గల వెంకటేశ్వర ఆలయం(కుక్కలగుట్ట) వరకు మార్గం మొత్తం మూల మలుపుతో కూడా ఉంటంది. ఈ మూలుపులు అధిక భాగం ఉండడంతో అటు వైపు నుంచి వచ్చే వాహనాలు కనిపించడంలేదు. దీంతో తరచుగా వాహన ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గంగుండా పలు వాహనదారులు అధిక వేగంతో రావడం వల్ల ఇతర ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆసుపత్రి ప్రాంతం, ఆర్టీవో కార్యాలయం దగ్గరగా ఉండడం వల్ల రద్దీ ఎక్కువగా అయినప్పుడు వాహనాలు ఢీకొని ప్రజలు గాయాల పాలయ్యారు. ఈ ప్రమాదంలో మూల మలుపులు, సూచకబోర్డులు, స్పీడ్ బ్రెక్‌లు లేక పోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. వెంటనే అధికారులు స్పందించి సూచికలు, స్పీడ్ బ్రెక్‌లు ఏర్పాటు చేసి రోడ్డుపై ఒక వైపు వాహనాలు వచ్చే విధంగా డివైడర్‌లు ఏర్పాటు చేయాలని వాహనదారులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.


గుడి వెనుక గల పాఠశాలలకు వెళ్లే ప్రమాదకర మూలమలుపు

స్పీడ్‌బ్రెక్‌లు, సూచికబోర్డు వెంటనే ఏర్పాటు చేయాలి..

● ఎ.ప్రవీణ్‌గౌడ్, స్థానికుడు

నిత్యం ఈ మార్గం గుండా అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మూల మలుపు ఎక్కువగా ఉండడంతో తరచూ ప్రమాదాలు ఢీకొని ప్రయాణికులు గాయాల పాలవుతున్నారు. వెంటనే స్పీడ్ బ్రేకర్‌లు, డివైడర్‌లు, సూచిక బోర్డును ఏర్పాటు చేయాలి.


మోడల్ స్కూల్ - చిన్న వాల్గోట్ రోడ్డుపై ధ్వసంమైన స్లాబ్ కల్వర్టు


పూసల తండా - గడ్కోల్ గ్రామాల మధ్యలో అధ్వానంగా మారిన రోడ్డు

అధ్వానంగా గ్రామీణ రోడ్లు

» మరమ్మతులకు నోచుకోక వాహనదారుల ఇబ్బందులు
» పట్టించుకోని పాలకులు

సిరికొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలోని కుగ్రామాలకు వెళ్లే రోడ్లు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోక పోవడం వల్ల తారు ధ్వంసమై కంకర రోడ్లు, మట్టి రోడ్లను తలపిస్తున్నాయి. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో మరమ్మతులకు నోచుకోని ఈ రోడ్లను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా పాలకులు గ్రామీణ ప్రాంత రోడ్లను మరమ్మతు చేయడానికి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. సిరికొండ మండలంలోని పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో సిరికొండ - చిన్నవాల్గోట్ గ్రామాల మధ్యలో గల సుమారు మూడున్నర కిలోమీటర్ల దూరం గల రోడ్డు మరమ్మతుకు నోచుకోకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారుల పరిస్థితి మరీ దారుణం రోడ్డు పొడవునా పెద్ద పెద్ద గుంతలు పడి వర్షాకాలంలో ద్విచక్ర వాహనాలపై ప్రయాణించడం ఆందోళన కరంగా ఉంటుంది. చిన్న వాల్గోట్, పెద్ద వాల్గోట్, పోత్నూర్ గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావడానికి చాలా దగ్గరి మార్గమవుతుంది. అందుకని ఈ రోడ్డు చాలా బిజీబిజీగా ఉంటుంది. తారు రోడ్డు ధ్వంసమై మట్టి రోడ్డుగా అవతరించింది. గడ్కోల్ విద్యుత్ కేంద్రం నుంచి పూసల తండా వెళ్లే రోడ్డు కూడా తారు రోడ్డు ధ్వంసమై గుంతల గుంతలుగా మారి పోయింది. కొన్ని చోట్ల రోడ్డంతా ధ్వంసమయింది. మరి కొంతభాగం తారు లేచి కంకర రోడ్డుగా మారింది. కార్నల్ తండా నుంచి ముషీర్‌నగర్ మీదుగా మెట్టుమర్రి తండా, గడ్డమీది తండా నుంచి కొండపూర్ వరకు గల ఈ రోడ్డు చాలా చాలా చోట్ల పాడై గుంతల మయ మయింది. అక్కడక్కడ డాంబరు రోడ్డు పాడై పోయింది గుంతల రోడ్డుగా అవ తరించింది. తూంపల్లి నుంచి పాకాల వెళ్లే పంచాయతీ రాజ్ రోడ్డంతా గుంతల రోడ్డుగా మారి పోయింది. వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారింది. పాకాల నుంచి పందిమడుగు వెళ్లే రోడ్డు సైతం అధ్వానంగా మారింది. ఒకటి, రెండు కిలో మీటర్ల మేర రోడ్డును అప్పట్లో అటవీ శాఖ అధికారులు అడ్డుకోవడం వల్ల మట్టి రోడ్డుగానే మిగిలి పోయింది. వర్షాకాలంలో ఈ రోడ్డుపై రాక పోకలు నిలిచిపోతాయి. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు మారుమూల గ్రామాలకు వెళ్లే రోడ్లను బాగు చేయడానికి ప్రభుత్వానికి నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాలని ప్రజలు కోరుతున్నారు. ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నిస్తే ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపించామని చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మాత్రం మార్చి తర్వాత ప్రభు త్వం నిధులు మంజూరు చేస్తుందని చెబుతున్నారు. డాక్టర్ భూపతిరెడ్డిపై మండల ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుని ఎమ్మెల్యేగా గెలిపించారు. ప్రజల ఆశలను వమ్ము చేయకుండా మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లను పక్కా రోడ్లుగా మార్చడానికి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.


సిరికొండ - చిన్న వాల్గోట్ గ్రామాల మధ్యలో ధ్వంసమైన తారు రోడ్డు

ధర్మరక్షణకు ప్రతిఒక్కరూ నడుం కట్టాలి

● జగద్గురు నరేంద్ర ఆచార్య మహరాజ్

భక్తి

మద్నూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ధర్మరక్షణ కోసం ప్రతిఒక్కరూ ముందుకు రావాలని తమ ధర్మాన్ని కాపాడుకోవాలని నానీజ్ ధాం జగద్గురు నరేంద్ర ఆచార్య మహరాజ్ పిలుపునిచ్చారు. జుక్కల్ మండలంలోని దోస్పల్లి బంగారు పల్లి వద్ద ఉపపీఠంలో ఆయన గురువారం భక్తులకు మార్గదర్శనం చేశారు. దేశంలో ధర్మరక్షణ కోసం ఆయా పీఠాల జగద్గురులు కృషి చేస్తున్నారని దాంట్లో భాగంగా మీరు సైతం మీ పరిధిలో ధర్మ రక్షణ కోసం పాటుపడాలని సూచించారు. అదే విధంగా సమాజంలో ప్రతిఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని అన్నారు. సనాతన ధర్మాన్ని రక్షించడానికి ప్రతీఒక్కరు ముందుకు రావాలని గుర్తు చేశారు. సనాతన ధర్మమంటే మన పూర్వీకులు ఆచరించిన ధర్మమే సనాతన ధర్మమని ఇంటి కొచ్చిన వారిని ప్రేమతో పలకరించడం, గురువులను తల్లి దండ్రులను, గౌరవించడం, ప్రతీరోజు దేవాలయానికి వెళ్లి పూజలు చేయడం సనాత ధర్మానికి గుర్తు అని తెలిపారు. అనాదిగా వస్తున్న మన ఆచార్య వ్యవహారాలాలను ఆచరించాలని గుర్తు చేశారు. గ్రామాల్లో ఉన్న దేవాలయాలకు వెళ్లి వాటిపై దృష్టి పెట్టాలని వాటి పరిరక్షణకు నడుం కట్టాలన్నారు. పూర్వీకులు నిర్మించిన ఆలయాలు సనాతన ధర్మా నికి ప్రతీకలని పేర్కొన్నారు. ప్రతీఒక్కరు భక్తి భావనను పెంపొందించుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. వేద ధర్మీయులైన మనము ఆహారపు అలవాట్ల ను సాంప్రదాయ పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. తల్లి దండ్రులు తమ పిల్లలకు చిన్ననాటి నుంచి భక్తి భావనను పెంపొందించేలా కృషి చేయాలని సూచించారు. హిందూ ధర్మం అంటే మాతృదేవోభవ, పితృ దేవోభవ, ఆచార్య దేవోభవ, అతిథి దేవోభవ ఇది మన వేదాలు మనకు ఇచ్చిన గొప్ప సూక్తి అని గుర్తు చేశారు. మన ధర్మాన్ని కాపాడని వారు భక్తికి అనర్హులని గుర్తు చేశారు. ప్రతిఒక్కరూ సనాతన భావం కోసం పాటు పడాలని పేర్కొన్నారు. కార్యక్రమానికి మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చారు. స్వామీజీ దర్శనం కోసం గంటల తరబడి వేచి ఉన్నారు. అనంతరం స్వామీజీ భక్తుల సమస్యలకు పరిష్కార మార్గాలను చూపెట్టారు.


జుక్కల్ ఉప పీఠంలో ధర్మ బోధన చేస్తున్న స్వామీజీ


స్వామీజీ దర్శనానికి బారులు తీరిన భక్తులు

విజయ్ హైస్కూల్‌లో

బాలకవి సమ్మేళనం

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విజయ్ హైస్కూల్‌లో గురువారం బాలకవి సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, కవితా శక్తిని వెలికితీసి సాహిత్య స్పృహను కల్పించేందుకు ప్రతీ సంవత్సరం నిర్వహించే బాలకవి సమ్మేళనాన్ని ఈ సంవత్సరం కూడా నిర్వహించినట్లు విద్యాసంస్థల కోశాధికారి లలితాదేవి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఐడీఎల్ ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యురాలు తారాచౌదరి, లలితాదేవిలు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. మూడవ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న వంద మంది విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. సాంప్రదాయ దుస్తులు ధరించి శ్రవణానందకరంగా కవితలను వినిపించారు.


సమ్మేళనంలో పాల్గొన్న బాల కవులు

జాతీయ స్థాయికి సారంగాపూర్

జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థుల ఎంపిక


జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులు

మోపాల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ మండలంలోని సారంగాపూర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపికై ఈ నెల 25న ఛత్తీస్‌ఘడ్‌లో జరిగే జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటున్న విద్యార్థులను గురువారం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన 68వ రాష్ట్ర స్థాయి అండర్-19 నెట్‌బాల్ టోర్నమెంట్‌లో ఈ పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభను కనబర్చారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయిలో పాల్గొనడం అభినందనీయమని ఉపాధ్యాయ బృందం వారిని అభినందించారు. వీరితో పాటు గ్రామ పెద్దలు ఉన్నారు.

తిర్మన్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి..

నిజామాబాద్ రూరల్ మండలంలోని తిర్మన్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 9వ తరగతి చదువుకుంటున్న సాయిదీక్షిత జాతీయ స్థాయిలో ఈనెల 25న ఛత్తీస్‌ఘడ్‌లోని బోర్బాలో జరిగే నెట్‌బాల్ పోటీకి ఎంపికైంది. ఎంపికైన విద్యార్థినిని గురువారం పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సీతాదేవి, ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు ఉన్నారు.

మోకన్‌పల్లిలో చర్చి ప్రారంభం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్

నవీపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోకన్‌పల్లిలో గురువారం నూతనంగా నిర్మించిన ఇమ్మానియల్ చర్చిని ప్రారంభించారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చి ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్ హాజరయ్యారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐపీసీ రాష్ట్ర అధ్యక్షుడు అహరోను, అనంతయ్య చౌదరి, నెహెమియా, జెకర్యా, సురేష్ కుమార్, ఆనంద్, జోసెఫ్, ఏసుదాసు, సోలోమన్, జాన్సన్ పాల్గొన్నారు.


మోకన్‌పల్లి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయాలి


ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

పెద్దకొడప్‌గల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను సిబ్బంది ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్వహించాలని ఎంపీవో రాము సిబ్బందికి సూచించారు. జుక్కల్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీవో రాము మాట్లాడుతూ ఇళ్లు లేని వారికోసం ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నందున సిబ్బంది జాగ్రత్తగా యాప్‌లో లబ్ధిదారుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల హౌసింగ్ ఏఈ హన్మంతు, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, సిబ్బంది రాజు పాల్గొన్నారు.

పిట్లం: ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్లకోసం దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల సర్వే త్వరితగతిగా పూర్తిచేయాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి అధికారులకు సూచించారు. గురువారం పిట్లంలో ఇంది రమ్మ ఇళ్లసర్వేను పరిశీలించారు. అనంతరం మండలంలోని చిన్న కొడప్ గల్ శివారులో నూతనంగా నిర్మించనున్న పెట్రోలు పంపు స్థలాన్ని ఆమె పరిశీలించారు. పెట్రోలు పంపు వివరాలు, పత్రాలను పరిశీలించారు. కార్య క్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్‌గౌడ్, ఆర్ఐ శీతల్ పాల్గొన్నారు.

రాజంపేట: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వీవీ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇంటి సర్వేను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రఘురాం, పంచాయతీ కార్యదర్శి అశోక్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ సర్వేను అధికారులు పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో ఇంటికి వెళ్లి ఇందిరమ్మ ఇల్లు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలు అడిగి యాప్‌లో పొందుపరుస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గైని రాజేందర్, ఎండీ గఫూర్, పంచాయతీ సిబ్బంది గాండ్ల రాజు,సాయిలు, పిట్ల చిన్న సాయిలు, మైసయ్య ఉన్నారు.

మధ్యాహ్న భోజనం తీరు పరిశీలన

లింగంపేట, డిసెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్పల్లి ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో నరేష్ పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆయన సూచించారు. మండలంలోని మెంగారం, ఐలాపూర్, శెట్పల్లి, పర్మల్ల, గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వేను ఆయన పరిశీలించారు. సర్వేలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ఆయన సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

రసాయన రహిత ఎరువుల వాడకం మేలు

సదాశివనగర్,డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రసాయన రహిత ఎరువుల వాడకం రైతులతో పాటు యావత్ ప్రజానికానికి ఎంతో ఆరోగ్యదాయకమని మాజీ జడ్పీటీసీ పడిగెల రాజేశ్వర్‌రావు అన్నారు. ఇటీవల ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా రసాయన రహిత ఎరువుల కర్మాగారాన్ని గురువారం సందర్శించినట్లు చరవాణి ద్వారా తెలిపారు. ఆస్ట్రేలియా రైతులు వ్యవసాయంలో ఆర్గానిక్ వ్యవసాయ పద్ధతులను ఎలా అవలంబిస్తున్నారో అడిగి తెలుసుకోవడం జరిగిందని తెలిపారు. మన రాష్ట్రంలో కూడా రైతులకు ఆర్గానిక్ వ్యవసాయం వైపు మల్లేవిదంగా అవగాహన కార్యక్రమాలు చేయాలని అన్నారు.

పశువులకు ఉచిత గర్భకోశ నిర్ధారణ పరీక్షలు

సదాశివనగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారావుపేటలో జిల్లా పశుసంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి సంజయ్‌కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా పశుగణాభివృద్ధి అధికారి అబ్దుల్ మాజీద్‌తో కలిసి పాడిరైతులకు పశుపోషణపై తగు సూచనలు చేశారు. దేశవాళి గేదెలకు ఏదో సమయంలో కృత్రిమ గర్భధారణ చేయించినట్లయితే నాణ్యమైన సంకరజాతి సంతతి అభివృద్ధిచెంది పాడి పరిశ్రమ లాభసాటిగా ఉంటుందన్నారు. 54 గేదెలకు, 18 ఆవులకు గర్భకోశ వ్యాధి పరీక్షలు నిర్వహించి 4 ఆవులకు కృత్రిమ గర్భధారణ, 60 దూడలకు నట్టల నివారణ మందులను అందించామని తెలిపారు. అనంతరం రైతులకు పోటీలు నిర్వహించి బహుమతులు, పాలకేన్లతో పాటు కాల్షియం డబ్బాలను పంపిణీచేశారు.ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారిని అనూష, పశుగణన సహాయకులు కిషోర్, పాలకేంద్రం అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.

చిరుత సంచారంతో గ్రామస్థుల భయాందోళన

లింగంపేట, డిసెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంచుమల్ అటవీ ప్రాంతంలో చిరుత సంచారంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. బుధవారం రాత్రి సీతాయిపల్లి, కంచుమల్ రహదారిపై పలువురికి చిరుత కనిపించదని వారు తెలిపారు. కంచుమల్, కొండాపూర్, ముంబాజీపేట, సీతాయిపల్లి గ్రామాల ప్రజలు, రైతులు భయాందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి చిరుతను బంధించి జూకు తరలించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అయ్యప్ప ఆలయానికి భారీ విరాళం

ఎల్లారెడ్డి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో అయ్యప్ప ఆలయ అభివృద్ధికి ఎల్లారెడ్డి సొసైటీ వైస్ చైర్మన్ మత్తమాల ప్రశాంత్ గౌడ్ ఒక లక్షా 18 వేల రూపాయల విరాళాన్ని ఆలయ కమిటీకి అందచేశారు. బుధవారం రాత్రి జరిగిన అయ్యప్ప మహా పడిపూజ సందర్భంగా ఈ విరాళాన్ని ఆయన తల్లి చేతుల మీదుగా నగదు కమిటీ గౌరవ అధ్యక్షులు చంద్రంకు అందజేశారు. ఆలయ అభివృద్ధి కోసం మరింత సహకరిస్తానని ప్రశాంత్ గౌడ్ తెలిపారు. అంతకుముందు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు క్యాబినెట్ హోదాలో చోటు దక్కి మంత్రి పదవి రావాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి వి. రాజేందర్ నాథ్, కృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి వ్యాఖ్యలపై నిరసన


సమావేశంలో నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పెద్దకొడప్‌గల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారతరత్న అంబేద్కర్‌ను అవమానించిన కేంద్రమంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని చిన్నతక్కడ్‌పల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రూసేగాం భూమయ్య మాట్లాడుతూ అంబేద్కర్ అంటే ఏ ఒక్కరికీ అస్థిత్వం కాదని, అంబేద్కర్ అందరివాడని పేర్కొన్నారు. దేశ రాజకీయ మౌలికనిర్మాణాన్ని చారిత్రకవాదంతో విశ్లేషించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. అటువంటి మహాత్ముడిని కించపరిచే విధంగా మాట్లాడిన అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించడంతో పాటు దేశంద్రోహం కేసునమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జుక్కల్ నియోజకవర్గ ఇంచార్జి వెండి యాదవ్, బిచ్కుంద, జుక్కల్, పెద్ద కొడప్‌గల్, పిట్లం, మద్నూర్ మండలాల అధ్యక్షులు బాలన్న, అయిల్‌వార్ మారుతి, సర్వగల్ల రవీందర్, మహిపాల్, శంకర్ పాల్గొన్నారు.

కామారెడ్డిటౌన్: పట్టణంలోని రైల్వేకమాన్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద అమిత్‌షా దిష్టిబొమ్మను కాంగ్రెస్‌నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్‌ను అమిత్‌షా కించపరచడంతో పాటు ప్రతిపక్షాలను తక్కువ చేసే విధంగా వ్యవహరించారని అన్నారు. ఆయన పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దుచేసి అనర్హుడిగా ప్రకటించాలని యావత్ దేశానికి క్షమాపణ చెప్పాలని అన్నారు. లేకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టి బీజేపీ నాయకులను అడ్డుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రవి, అజ్మత్‌అలీ, సిద్దిక్, రఫీ, విక్రం, గంగాధర్, రాజు,అమ్ము, చంద్రకాంత్, రంజిత్, సందీప్ పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మండల అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నాగి రెడ్డిపేట మండల కేంద్రంలో గురువారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ నుంచి ప్రధాన రహదారి గుండా అంబేద్కర్ విగ్రహం వరకు అంబేద్కర్ సంఘం నాయకులు నాయకులు కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. కేంద్ర మంత్రి అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కించపరిచే విధంగా వ్యా ఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మంత్రి చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. ర్యాలీలో మాజీ జడ్పీటీసీ జయరాజ్, మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు బాబురావు, అంబేద్కర్ సంఘం నాయకులు లక్ష్మణ్ రాగూర్, పోచయ్య, ఆత్మ కూర్ బాబురావు, బాలాజీ, యాదగిరి, రాజు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బిచ్కుందలో అక్రమ ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బిచ్కుంద,డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మంజీర పరివాహక ప్రాంతాల నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడుఇసుక ట్రాక్టర్లను పట్టుకోవడం జరిగిందని ఎస్ఐ మోహన్‌రెడ్డి తెలిపారు. పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా హస్గుల్ గ్రామ మంజీర నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌లను పట్టుకుని పోలీసుస్టేషన్‌కు తరలించి కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలోని పుల్కల్, శెట్లూర్, ఖత్‌గావ్, మంజీర పరివాహ ప్రాంతాల నుంచి ఎవరైన అక్రమంగా ఇసుక తరలిస్తే సమాచారం అందించాలన్నారు.

జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించిన చైర్మన్


నిజామాబాద్ గ్రంథాలయ చైర్మన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కామారెడ్డిటౌన్,డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి):కామారెడ్డి జిల్లా గ్రంథాలయాన్ని గురువారం నిజామాబాద్ గ్రంథాలయసంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి సందర్శించారు. కామారెడ్డి గ్రంథాలయంలో ఉద్యోగాలకోసం సన్నద్ధం అవుతున్న వారి కోసం అన్ని సౌకర్యాలు కల్పించడం, పుస్తకాలను అందుబాటులోకి తేవడం అభినందించదగిన విషయమని అన్నారు. ఉమ్మడి జిల్లానుంచి విడిపోయిన తర్వాత కామారెడ్డి జిల్లా గ్రంథాలయాలు అభివృద్ధిచెందడం మంచిపరిణమామని పోటీపరీక్షలకు సిద్ధం అవుతున్నవారికి మంచి సౌకర్యాలు కల్పిస్తే ఉద్యోగాలు సాధించేందుకు వీలుంటుందని తెలిపారు.అనంతరం గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దిచంద్రకాంత్‌రెడ్డి ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకుడు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోసానిపేట్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి

రామారెడ్డి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండలం పోసానిపేట్ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పి చాలని పోసానిపెట్ వీడీసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిరాకు గురువారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ నేతృత్వంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు గీరెడ్డి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో విన తిపత్రాన్ని సమర్పించారు. ఉదయం మూడు ట్రిప్పులు, సాయంత్రం మూడు ట్రిప్పులు కామారెడ్డి పాత బస్టాండ్ నుండి అడ్లూర్, రంగంపేట రైల్వే గేట్, పోసానిపేట్ రైస్‌మిల్, పోసానిపేట్, గంజి వాగు, మద్దికుంటకు అదనపు బస్సు ఇవ్వాలని డిపో మేనేజర్ కోరారు. సానుకూలంగా స్పందించిన డిపో మేనేజర్ రేపటి నుంచి అదనపు బస్సు సౌకర్యం కలిపించాలని ఆర్టీసీ సీఐ లింగమూర్తి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ మండల నేత నారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఉప్పల్వాయి నేత దత్తాద్రి, నాయకులు నర్సింలు, వీడీసీ కార్యదర్శి గండ్ర నర్సింలు, చాకలి బాలయ్య, చాకలి సాయిలు, పళ్లెం లింగం, పళ్లెం నిశాంత్, బండి పోచయ్య, ఇస్త్రిరి సాయిలు నాయ కులు తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం సమర్పిస్తున్న పోసానిపేట్ వీడీసీ నేతలు


పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈవో ప్రవీణ్

అర్థమయ్యేరీతిలో విద్యాబోధన చేయాలి

పెద్దకొడప్‌గల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాలలో చిన్నారులకు పాఠాలు బోధించే ఉపాధ్యాయులు వారికి అర్థమయ్యేరీతి లో విద్యాబోధన చేయాలని మండల విద్యాధికారి ప్రవీణ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కాటేపల్లి తండా ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఎంఈవో పాఠశాల రికార్డులు తనిఖీ చేశారు. దీంతో పాటుగానే పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న చిన్నారుల అభ్యసనాభివృద్ధిని పరిశీలించారు. పిల్లల అభ్యసనాభివృద్ధి పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యను చిన్నారులకు అందించాలని సూచించారు. ప్రాథమిక దశలోనే చిన్నారులకు నాణ్యమైన విద్యను అందిస్తే ఆ విద్యార్థులపై తరగతులలో రాణిస్తారని తెలిపారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనం పరిశీలించారు. పాఠశాల టాయిలెట్స్ పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్, హారిక తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణదశలో ఉన్న భవనంలో పాఠశాల తరగతుల నిర్వహణ

కామారెడ్డిటౌన్, డిసెంబరు 19: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని లిటిల్‌స్కాలర్ పాఠశాల విద్యార్థులకు నిర్మాణదశలో ఉన్న భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారని విద్యార్థి సంఘనాయకులు అన్నారు. గురువారం పలువురు తల్లిదండ్రులు ఈ విషయాన్ని తమ దృష్టికి తీసుకురావడంతో అక్కడికి వెళ్లగా నిజంగానే నిర్మాణదశలో ఉన్న భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. పాఠశాలలో ఇష్టానుసారంగా ధనార్జనే ధ్యేయంగా వేలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులకు మాయమాటలు చెబుతూ విద్యార్థుల సౌకర్యాలను మాత్రం కల్పించడంలో పాఠశాల యాజమాన్యం విఫలమైందని అన్నారు. సిమెంట్, ఇసుక బస్తాలు, వ్యర్థాలతో విద్యార్థులకు ఏదైనా ప్రమాదం జరిగితే ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయాన్ని విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించి విద్యార్థులకు ఏదైన ప్రమాదం చోటు చేసుకోకముందే తగిన విధంగా స్పందించాలని కోరుతున్నామన్నారు.కార్యక్రమంలో బీవీఎం రాష్ట్రకార్యదర్శి విఠల్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముదాం అరుణ్, జీవీఎస్ రాష్ట్రనాయకులు వినోద్, రాహుల్, శివ, వినోద్, నవీన్, ప్రసాద్ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

దోమకొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం ఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తులకు జరిమానా విధించారు. కార్లు, బైక్‌లను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు పోలీసుల నిబంధనలను తప్పకుండా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. తనిఖీల్లో ఏఎస్సై సుబ్రహ్మణ్య చారి, పీసీలు కిరణ్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

తాండూర్‌లో పశు వైద్య శిబిరం

నాగిరెడ్డిపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండూర్ గ్రామంలో ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ పశువైద్య శిబిరంలో గ్రామంలోని పశువులకు ఉచిత వైద్య చికిత్సలను పశువైద్య అధికారులు అందజేశారు. గ్రామంలోని 30 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలను, 25 పశువులకు సాధారణ చికిత్సలు అందజేశారు. అలాగే 10 గేదెలకు కృత్రిమ గర్భధారణ చికిత్సలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రజిత వెంకట్ రాంరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, మండల కాంగ్రెస్ నాయకులు కిష్టయ్య, శ్రీరాం గౌడ్, సంగయ్య, పశువైద్యాధికారులు డాక్టర్ రవికుమార్, దివ్యశ్రీ, పశు వైద్య సహాయ సిబ్బంది సాయిరెడ్డి, గౌస్ మొయిద్దీన్ ,జయరాజ్, గంగారాం పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

మాచారెడ్డి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమార్‌పేట్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమేష్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని గురువారం మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రాంరెడ్డి, మాజీ రైతుబంధు కన్వీనర్ నర్సింలు, మండల ప్రధానకార్యదర్శి రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యోగా కేంద్రంలో సీఎంకప్ పోటీలు


చిన్నారులను అభినందిస్తున్న మున్సిపల్‌చైర్‌పర్సన్

కామారెడ్డిటౌన్,డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి):కామారెడ్డి పట్టణంలోని యోగ కేంద్రంలోని ఏర్పాటుచేసిన యోగ సీఎంకప్ పోటిల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హజరైన గ్రంథాలయ సంస్థచైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ మాట్లాడుతూ యోగా అంటే వ్యాయమ సాదనల సమహరాల ఆధ్యాత్మిక రూపమని అన్నారు.మోక్ష సాధనలో ధ్యానం అంతఃదృష్టి,పరమానంద ప్రాప్తిలాంటి ఆధ్యాత్మికపరమైన సాధనలకు పునాదని అన్నారు. దీనిని సాధన చేసే వాళ్లను యోగులు అంటారని తెలిపారు. ధ్యాన యోగం ఆధ్యాత్మిక సాధనకు మానసిక ఆరోగ్యానికి చక్కగా తొడ్పడుతుందని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్రీడాకారులకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. అందులో భాగంగానే సీఎంకప్ పోటిలను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.అనంతరం పలువురు యోగసనాలు వేయడంతో వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో యోగగురువులు రాంరెడ్డి, గరిపల్లి అంజయ్యగుప్తా, జగన్నాథం,అంజయ్య, అనిల్‌రెడ్డి, నరసింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజయోగధ్యాన అవగాహన సదస్సు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ

కామారెడ్డిటౌన్,డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితులలో ప్రజలు పని ఒత్తిడితో తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని అలాంటి సమయంలో ప్రశాంతతకై రాజయోగ ధ్యానం ఎంతో ఉపయోగపడుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియచంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం కామారెడ్డి మున్సిపాలిటిలోని కళాభారతీలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఓంశాంతి నిర్వాహకులు అంజలిదీదీ, రజినిదీదీ, సంతోషిదీదీ, చంద్రకళ దీదీ, అనిల్‌భాయ్,జయదీదీ, పట్టణ కౌన్సిలర్‌లు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

గాంధారి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మాజీ జడ్పీటీసీ తల్లి అనారోగ్యంతో మృతిచెందడంతో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలకు మాజీ ఎమ్మెల్యే నల్లమడుగు సురేందర్, మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు తదితర నాయకులతో పాటు హాజరై అంత్యక్రియల్లో పాల్గొని బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు.

మెటీరియల్‌ను అమ్ముకున్నవారిపై చర్యలు తీసుకోండి

● కౌన్సిలర్లు

కామారెడ్డిటౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని ఎంటీఆర్, ఎల్లమ్మసంప్, గడివాటర్ ట్యాంక్, బుర్రమత్తడి ప్రదేశాలలో ఉన్న ఎలక్ట్రికల్ మెటీరియల్‌ను అమ్ముకున్నవారిపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్‌లు నిట్టు కృష్ణామోహన్, ముప్పారపు అపర్ణ, ప్రముఖులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాలలో ఉన్న మోటార్‌లు, పంప్‌లు, కాపర్‌వైండింగ్ వైర్, జీఐపైపులు, స్లయిస్ వాల్స్ బోరు కేబుల్‌వైర్‌లు, ఓల్డ్ స్ట్రీట్ లైట్‌డోమ్స్, నీటిసరఫరా, ఎలక్ట్రికల్ సంబంధించిన కొత్త, పాత విడిభాగాలు సుమారు 12 మున్సిపల్ ట్రాక్టర్‌ల లో న్యూఫిల్టర్ బెడ్ వద్దకు చేర్చి లారీలలో, బోలేరో వాహనాలలో దొంగతనంగా ఎత్తుకెళ్లి అమ్మివేశారని ఆరోపించారు. ఈ సామాగ్రిని ఎవరెవరు తరలించారు, ఎవరి ఆదేశాలతో తరలించారు ఏఏ వాటర్‌వర్క్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారనేది నిగ్గుతేల్చి తగిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	- రోటి కప్‌డా రోమాన్స్
దర్శన్	- మిస్ యూ
ప్రియ 70	- పుష్ప-2
ప్రియ 35	- ఫణి

బాన్సువాడ

మహేశ్వరి	- పుష్ప-2
వెంకటేశ్వర	- ఫణి

చికెన్ ధరలు

రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	160
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190